క్లుప్తంగా

అగ్నిమాపకాధికారి బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపకాధికారిగా ఎస్.వేణుగోపాలరావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన మంగళవారం ఉన్నతాధికారులను కలిశారు. గతంలో మాచర్ల, బాపట్ల, చిలకలూరిపేట, గుంటూరులో పనిచేసిన ఆయన పదోన్నతిపై నెల్లూరు వెళ్లి, అక్కడి నుండి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రాణ, ఆస్తి రక్షణే ధ్యేయంగా తమ శాఖ పని చేస్తోందని వేణుగోపాలరావు విలేకర్లతో బుధవారం అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే తమ కార్యాలయానికి సమాచారమందించాలని కోరారు.

బాలుడు అదృశ్యం

తెనాలిరూరల్: అస్సాంకు చెందిన బాలుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అస్సాంకు చెందిన ఓ కుటుంబం ఇటుక పనుల నిమిత్తం తెనాలి సుల్తానాబాద్‌కు వచ్చి ఉంటున్నారు. వీరి కుటుంబంలోని 13 ఏళ్ల బాలుడు గొలా మే 27 నుంచి కనబడకుండా పోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు కోర్టు ఇచ్చే తీర్పే దివ్య ఔషధం అని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు 190 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, దానయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, పిచ్చయ్య, గురవయ్య, హగ్గయ్య, ఇమాంబి, సారమ్మ, దుర్గాభవాని, నాగేశ్వరరావు, కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడేలా సిమెంటు రోడ్ల నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.75 లక్షల వ్యయంతో కండ్రిక, ఫిరంగిపురం, వేములూరిపాడు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కె.రామకోటేశ్వరరావు, వై.ప్రకాష్, అప్పయ్య, ఎన్.రవి, బి.సతీష్, కె.శేషు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని బీసీ హాస్టల్‌ను కొత్తగా నిర్మించేందుకు మంత్రి నారా లోకేష్ చొరవ చూపారు. దీంతో రాడికో ఖైతాన్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడంతో పాత బిల్డింగ్‌ను తొలగించి కొత్త బిల్డింగ్ నిర్మాణానికి బుధవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లిపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కొల్లి శేషు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి పార్టీ పరిశీలకులు సత్యనారాయణ, పెనుమాక, ఉండవల్లి కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్ద పీట

- రాష్ట్రానికి తలమానికంగా తెనాలి మహిళా మండలి భవనం సేవలు వినియోగిస్తాం
- మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా కృషి చేస్తాం
- రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



మహిళా భవనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మద్దన కస్తూరిభాయి, పక్కన మంత్రి నాదెండ్ల

తెనాలిటౌన్: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా కృషి చేస్తామని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఐదు కోట్ల విలువైన మహిళ మండలి భవనాన్ని ఇటీవల ప్రభుత్వానికి అప్పగించగా రూ.20 లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులతో మరమ్మతులు చేయించి నూతన భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ సమాజంలో ఆదర్శవంతంగా పనిచేయాలన్నా తపనతో మహిళాల ఆర్థిక పురోగతికి అవసరమైన సేవలను మహిళ మండలి భవనంలో అందుబాటులోకి తీసుకు వస్తామని స్పష్టం చేశారు.

దశాబ్దాల చరిత్ర కలిగిన మహిళా మండలి భవనం తెనాలి నియోజకవర్గంలోని మహిళల అభ్యున్నతికి దోహదపడటం ముదావహమని కొనియాడారు. భవిష్యత్‌లో ఆడబిడ్డలకు శిక్షణ కేంద్రంగా విరాజిల్లుతుందని, భావితరాలకు వినియోగపడేలా సేవలు కొనసాగిస్తామని వెల్లడించారు. అంతస్తు పై భాగంలో మెప్మా కార్యాలయం, కింద కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించడం ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తామని అన్నారు. రాబోయే ఆరు నెలల్లో 1000 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గతంలో ఈ మహిళా మండలి భవనం ఏర్పాటుకు ఎందరో మహిళామూర్తులు త్యాగాలు చేశారని, వారి స్ఫూర్తిని కొనసాగిస్తామని మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ గోగినేని ఉమ పేర్కొన్నారు. మెప్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ మెప్మా కార్యాలయానికి భవనాన్ని సమకూర్చడమే కాక మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా పనిచేయడం ముదావహమన్నారు.

సబ్‌కలెక్టర్ సంజన సిన్హా మాట్లాడుతూ పేద మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా భవనం సేవలు వినియోగిస్తామని, మంచి ఉద్దేశ్యంతో భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన డాక్టర్ మద్దన కస్తూరిభాయ్ ఆశయాన్ని నిలబెడతామని భరోసానిచ్చారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ మద్దన కస్తూరి భాయ్ భర్త కోటేశ్వరరావు, మహిళా మండలి కార్యదర్శి కొడాలి ఝాన్సీకుమారి, మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ గోగినేని ఉమలను మంత్రి మనోహర్, ఇతర అధికారులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న మంత్రి

ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు

కొల్లిపర: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని వల్లభాపురం గ్రామంలో శ్రీ వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం ఎద్దుల ద్వారా వ్యవసాయం రైతులతో ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించి నాగలి ఎద్దులకు వేదొక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ 103 సంవత్సరాలు క్రితం దేవాలయం నిర్మించబడిందని ఆనాటి నుంచి ప్రతి సంవత్సరము ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు దేవాలయంలో క్రమం తప్పకుండా రైతుల సహకారంతో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయటం వలన గ్రామంలో రైతులు సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు బాగా పండుతాయి అని నమ్మకంతో పూజలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో గ్రామంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం గ్రామంలో ఎద్దులు ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంగ వీరారెడ్డి, మందాల సంగిరెడ్డి, ఏమినేని వెంకట నాగేశ్వరరావు, జి. బసివిరెడ్డి, తాడిబోయిన శివయ్య, దేశ బోయిన స్వరయ్య, పామర్తి వెంకటేశ్వరరావు, ఏమినేని పానకాలు, అర్చకులు నందివెలుగు సాయి వెంకటరామయ్య, కొండ బుల్లిరెడ్డి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న రైతులు

వైకుంఠాధిపతికి గరుడ సేవ

తెనాలిటౌన్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక వైకుంఠపురం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు స్వామివార్లకు గరుడ సేవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాల్లో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టణంలో గరుడసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి రైతులంతా సమృద్ధిగా ఉండాలని ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశంగా తెలిపారు. ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



పురవీధుల్లో స్వామివారి గరుడ సేవ

కమిషనర్ బండి శేషన్న సేవలు అభినందనీయం

తెనాలిటౌన్: నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం కమిషనర్ బండి శేషన్నకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి మెమోంటో బహుకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన 18 నెలల కాలంలో బండి శేషన్న మంచితనం పరిపాలన దక్షత అభినందనీయమని కొనియాడారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ తెనాలి కమిషనర్‌గా పనిచేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఇక్కడి ప్రజల ఆదరణ, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం మరువరానిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, ఆర్‌వో రాంప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీలు వాణి, శివన్నారాయణ, వివిధ శాఖల అధికారులు, పలువురు కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనర్ బండి శేషన్న మెమోంటోతో సత్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, ఇతర అధికారులు

కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్‌కు దరఖాస్తులు

తెనాలి: స్థానిక చినరావూరు జగ్గడిగుంటపాలెంలో గల కేంద్రీయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రథమ ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయనీ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని 10వ తరగతి, 12వ తర గతి విద్యార్థులు 2024–25 సంవత్సరానికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించామన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



తెనాలిటౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య పిలుపునిచ్చారు. పట్టణ శాంతినగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, సచివాలయ మహిళా పోలీసు జ్యోత్స్నశ్రీ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందివెలుగు జంక్షన్‌లో ఆక్రమణలు తొలగింపు

తెనాలిటౌన్: నందివెలుగు–తెనాలి ప్రధాన రహదారిపై నందివెలుగు జంక్షన్ చుట్టూరా ఉన్న ఆక్రమణలను బుధవారం పంచాయతీ అధికారులు తొలగించారు. ప్రధాన రహదారి చుట్టూరా చిరువ్యాపారులు, బండ్లు, టిఫెన్ సెంటర్లు ఇతర వ్యాపార లావాదేవీలు జరుపుతుండటంతో ఆ ప్రాంతం ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోతుంది. స్థానిక శాసనసభ్యులు, మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ఎంపీడీవో అత్తోట దీప్తి ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులకు పురమాయించారు. దీంతో అధికారులు ఆక్రమణలను తొలగించి ఆప్రాంతాన్ని ఖాళీ చేయించారు.



ప్రధాన రహదారిపై తొలగించిన ఆక్రమణలు

విజ్ఞానాన్ని దోసిలిపట్టి.. ఉద్యమానికి ఊపిరి బిగపట్టి...

నేడు తెనాలిలో డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహావిష్కరణ



డాక్టర్ వెలగా వెంకటప్పయ్య

తెనాలి: ఆయనో సాధారణ గ్రంథాలయ ఉద్యోగి. జీతం కోసమే ఉద్యోగం చేయలేదు. విజ్ఞానాన్ని దోసిలి పట్టారు. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిద్దుకున్నారు. ఎందరినో ప్రభావితులను చేశారు. గ్రంథాలయ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు. ఆ రంగానికి సంబంధించి ప్రభుత్వానికి మార్గదర్శనం చేశారు. రాష్ట్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం ముమ్మరంగా జరుతున్న ప్రస్తుత తరుణ ంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని గురువారం ఇక్కడి 'తెనాలి బండ్'లో ఆవిష్కరించనున్నారు. ఆయనను స్మరించుకోవటం సందర్భోచితం.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సభ్యుడిగా చేసిన డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, ఒకప్పుడు సాధారణ గ్రంథాలయ ఉద్యోగి. జీతం కోసం మాత్రమే పనిచేయకుండా, గ్రంథాలయాల్లోని విజ్ఞానంతో చదువుల దాహం తీర్చుకున్నారు. తనను తాను ఉన్నతంగా తీర్చిదిద్దుకున్నారు. డాక్టరేట్ అందుకున్నారు. కలం పట్టారు... వందల పుస్తకాలు రాశారు... సంకలనం చేశారు. 60 వేల పేజీల పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఎందరినో రచయితలను చేశారు. గ్రంథాలయాల స్థాపనకు దారిచూపారు. నమూనా పౌరగ్రంథాలయాల చట్టాన్ని రూపొందించారు. గ్రంథ సూచీలు, అనుక్రమణికల తయారీలోనూ అందెవేసిన చేయి అనిపించుకున్నారు. వయోజనవిద్య, బాల సాహిత్యంలోనూ విశేష కృషి చేశారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య వంటి గ్రంథాలయ ఉద్యమకారుల వారసత్వాన్ని తీసుకున్నారు. పుస్తకానికి పెద్ద దిక్కయ్యారు. 'నడిచే గ్రంథాలయం' అన్నారు మరికొందరు. ఎన్నో గౌరవాలను అందుకున్నారు. గ్రంథాలయ ఉద్యోగంతో ఎదిగి, గ్రంథాలయ ఉద్యమానికి వెన్నెముకగా నిలవడం వెనుక డాక్టర్ వెలగా అకుంఠిత దీక్ష, అపారమైన శ్రమ ఉన్నాయి.

తెనాలి అయితానగర్‌లోని సామాన్య రైతు కుటుంబంలో 1932లో జన్మించిన వెలగా జీవితం, శాఖా గ్రంథాలయంలో చిరుద్యోగంతో పుస్తకాలతో ముడిపడింది. కాలేజీ విద్యాభ్యాసంలో ఉండగానే 1956 లో వచ్చిన ఉద్యోగంలో చేరిపోయారు. అంతటితో విద్యను వదులుకోలేదు. గ్రంథాలయ విజ్ఞానం, బాలసాహిత్యం, వయోజనవిద్య అధ్యయనం చేశారు. ఉన్నత చదువులు చదివారు. పీహెచ్‌డీ చేశారు. 'తెలుగులో బాలసాహిత్య వికాసం–ఆంధ్రప్రదేశ్‌లో బాలల గ్రంథాలయాల ప్రగతి'పై ఆయన రాసిన పరిశోధన వ్యాసం, ఆ ఏడాది అత్యుత్తమంగా ఎంపికై బంగారు పతకం అందుకుంది. ఉద్యోగ బదిలీలు వచ్చినపుడల్లా కొత్త ప్రదేశంలో రచయితలు, సాహితీవేత్తలు, ఇతర ప్రముఖులతో పరిచయం, పుస్తకాల అధ్యయనం, డాక్టర్ వెలగాను రచనా వ్యాసంగం వైపు మళ్లించాయి. ముందుగా గ్రంథాలయ విభాగంపై దృష్టి పెట్టారు. అందులో ఆయన స్పృశించని శాఖ లేదంటే అతిశయోక్తి కాదు. గ్రంథాలయ వర్గీకరణ, గ్రంథాలయ సూచీకరణ ప్రయోగ దీపికలు ఎంతో ప్రయోజనకారిగా గుర్తింపును పొందాయి. తెలుగు పుస్తకాల అమరిక, నిర్వహణలో ఎదురవుతున్న చిక్కులను తొలగించడానికి విదేశాల్లోని గ్రంథాలయ, సమాచార శాస్త్రవేత్తల సూచనలను పరిశీలించారు.

సోవియట్ రష్యా ప్రభుత్వ ఆహ్వానంపై మాస్కో పర్యటనకు వెళ్లి వచ్చాక లెనిన్ గ్రంథాలయ విధానం, 'లైబ్రరీ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌డియూఎస్ఎస్ఆర్' గ్రంథాన్ని వెలువరించి, ఆ వ్యవస్థను తెలుగువారికి పరిచయం చేశారు. వెలగా రచించిన ఆంధ్ర వాఙ్మయ సంగ్రహ సూచిక, శాస్త్రీయ వాఙ్మయ సూచిక, గ్రంథ సూచికలు వివిధ రంగాలపై ఆయనకు గల విషయ పరిజ్ఞానానికి అద్దం పడతాయి. కాకతీయ వర్సిటీకి సర్టిఫికెట్ కోర్సుకు ఆరు పుస్తకాలు, డిగ్రీకి 12 పుస్తకాలు రాశారు. పౌర గ్రంథాలయ చట్టాల పత్రాలను తెప్పించి 'ఇండియన్ లైబ్రరీ లెజిస్లేషన్' అనే గ్రంథాన్ని రెండు సంపుటాల్లో వెలువరించారు. ధర్మవరంలోని కళాజ్యోతి సంస్థ వెలగాపై గౌరవంతో పౌర గ్రంథాలయ సేవలోని ఉత్తమ గ్రంథ పాలకులకు 1990 నుంచి ఆయన పేరుతో పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. గుంటూరులోని ఒక వీధికి వెలగా పేరిట నామకరణం చేశారు. వెలగా జన్మదినం సందర్భంగా 2014లో విజయనగరం జిల్లా తోటపల్లి, పార్వతీపురంలో 50 గ్రామీణ గ్రంథాలయాలను ఆయనచే ప్రారంభింపజేవారు. ఆయన నిర్వహి ంచిన పదవులకు లెక్క లేదు. బీపీ, షుగర్ వంటి రుగ్మతలేవీ లేకుండా, కళ్లజోడును వాడకుండా పనిగడుపుతూ కొత్తగా తీసుకొచ్చిన పుస్తకం ఆవిష్కరణకు సన్నాహాల్లో ఉన్న డాక్టర్ వెలగా, 2014 డిసెంబరు 29న గుండెపోటుకు లోనయ్యారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మృత్యువాత పడ్డారు. ఆయన పరిచయస్తులకే కాదు...పుస్తక ప్రియులకూ ఆయన మరణం తీవ్ర విచారాన్ని మిగిల్చారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిటౌన్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం కార్యచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలనాధికారి జి.శ్రీకర్‌బాబుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కనపర్తి రత్నాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఏర్పాటు, నూతన అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని, ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్.జహీర్, అంబటి శ్యామ్‌సాగర్, అచ్యుత సాంబశివరావు, ఉన్నం భూషణం, మేకల సుబ్బారావు, వి.వి.నాయుడు, సిహెచ్.శేఖర్ తదితరులు ఉన్నారు.

ఏపీ ప్రజా నాటక కళాపరిషత్ కార్యాలయం ప్రారంభం



తాడేపల్లి రూరల్: ప్రాతూరులోని ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ నూతన కార్యాలయాన్ని ఏపీ నాటక కళా పరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యాలయాన్ని ప్రాతూరులో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ప్రాతూరులో ఆఫీసును ఏర్పాటు చేసిన శ్రీనివాస్, ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులందరినీ కలుపుకొని పనిచేస్తూ నాటక కళను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్, కె.ప్రసాదు, పి.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, సాంబశివరావు, హరిబాబు, నరసింహారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం ఇద్దరు యువకులు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై వెళుతూ ఢీకొన్నారు. ఈ ఘటనలో విజయవాడకు చెందిన రాజేష్, పెదకాకానికి చెందిన వెంకట్రావులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు ఇరువురినీ దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు.

ఆటో ఢీకొని ఒకరికి..

దుగ్గిరాల: బైక్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. దుగ్గిరాల లాకుల సమీపంలో రేపల్లె వెళుతున్న ఎ.మాణిక్యరావును ట్రక్ ఆటో బుధవారం ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు, చెయ్యి విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. వాహన దారులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై వెంకట రవి తెలిపారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ పాసులు

మంగళగిరి టౌన్: విద్యార్థులకు ఈనెల 14వ తేదీ నుంచి బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రెంటపళ్ల పిచ్చయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్ తీసుకునే వారు ముందుగా వారి వివరాలను ఏపీఎస్‌ఆర్‌టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 12, 13వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతుందని.. దీంతో బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ పనిచేయదని.. బస్‌పాస్ కావాల్సిన విద్యార్థులు 14వ తేదీ నుంచి బస్‌పాస్ కౌంటర్‌కు రావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.